ఫ్రాన్స్‌కు చేరుకున్న ఒలింపిక్ జ్యోతి

పారిస్: ప్రతిష్టాత్మక విశ్వ క్రీడలకు ఆతిథ్యమిస్తున్న ఫ్రాన్స్ క్రీడాభిమానుల ఆనందాన్ని మరింత రెట్టింపు చేస్తూ 'ఒలింపిక్ జ్యోతి' బుధవారం ఆ దేశం చేరుకుంది. గత నెల 16న గ్రీస్ లోని ప్రఖ్యాత ఒలింపియా వద్ద మొదలైన ఒలింపిక్ టార్చ్ ర్యాలీ మూడు వారాల తర్వాత ఫ్రాన్స్‌కు దక్షిణాదిన ఉన్న మార్సే నగరానికి చేరింది. ఏథెన్స్ నుంచి సముద్ర మార్గంలో సుమారు 12 రోజుల పాటు పురాతన బెలిమ్ అనే ఓడ ద్వారా ఒలింపిక్ జ్యోతి ఫ్రాన్స్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఒలింపిక్ జ్యోతికి ఘన స్వాగతం పలికింది. ఈ వేడుకలను ప్రత్యక్షంగా చూడటానికి మార్సే తీరానికి వేలాదిమంది క్రీడాభిమానులు తరలివచ్చారు.

20 ఓవర్ల ఆటలో 12 రన్స్‌కే ఆలౌట్

- మంగోలియా చెత్త రికార్డు

సానొ: బౌలర్లకు కాలరాత్రులను మిగుల్చుతూ బ్యాటర్లు పండుగ చేసుకుంటున్న పొట్టి ఫార్మాట్‌లో మంగోలియా జట్టు మాత్రం చెత్త రికార్డును మూటగట్టుకుంది. గతేడాది ఆసియా క్రీడల సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆ జట్టు.. జపాన్‌తో ఆడిన రెండో టీ20 మ్యాచ్‌లో 8.2 ఓవర్లలో 12 పరుగులకే ఆలౌట్ అయింది. బుధవారం సానొ (జపాన్) వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన జపాన్.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 217 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన మంగోలియా.. 12 రన్స్‌కే కుప్పకూలి 205 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఆ జట్టులో ఆరుగురు బ్యాటర్లు 'సున్నా'కే ఔటవ్వగా 4 పరుగులతో తుర్ సుమ్య టాప్ స్కోరర్. జపాన్ బౌలర్ కజుమొ 3.2 ఓవర్లు వేసి 7 పరుగులే ఇచ్చి ఐదు వికెట్లు తీశాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో ఇది (12) రెండో అత్యల్ప స్కోరు. గతేడాది ఫిబ్రవరి 'ఐల్ ఆఫ్ మ్యాన్'ను స్పెయిన్ 10 పరుగులకే ఆలౌట్ చేసింది.

మల్ల యోధులకు ఆఖరి చాన్స్

ఇస్తాంబుల్: పారిస్ ఒలింపిక్స్‌లో బెర్తులు దక్కించుకోవడానికి భారత రెజ్లర్లకు ఆఖరి అవకాశం. టర్కీ రాజధాని ఇస్తాంబుల్ వేదికగా నేటి నుంచి జరుగబోయే వరల్డ్ రెజ్లింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో మల్ల యోధులు తాడో పేడో తేల్చుకోనున్నారు. వేర్వేరు విభాగాలలో 14 మంది పోటీపడతారు. ఫ్రీ స్టయిల్ విభాగంలో అమన్ సెహ్రావత్, సుజీత్, జైదీప్, దీపక్ పునియా, సుమిత్, దీపక్ బరిలో ఉండగా గ్రీకో రోమన్ కేటగిరీలో సుమిత్, అషు, వికాస్, సునీల్ కుమార్, నితేశ్, నవీన్ పోటీ పడనున్నారు. మహిళల ఫ్రీ స్టయిల్‌లో మాన్సీ, నిషా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

మూడేండ్ల తర్వాత బరిలోకి నీరజ్

ఢిల్లీ: మూడేండ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో భాగంగా జావెలిన్ త్రోలో స్వర్ణం నెగ్గిన 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా మూడేండ్ల తర్వాత స్వదేశంలో బరిలోకి దిగనున్నాడు. ఈ నెల 12-15 మధ్య భువనేశ్వర్ వేదికగా జరగాల్సి ఉన్న 'నేషనల్ ఫెడరేషన్ కప్'లో అతడు పాల్గొననున్నాడు. 2021 మార్చి 17 తర్వాత నీరజ్ దేశవాళీలో ఆడలేదు. అంతర్జాతీయ టోర్నీలైన డైమండ్ లీగ్, వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఆసియా కప్ వంటి టోర్నీలలో నిలకడగా రాణించాడు.

రైజర్స్ వీరంగం

అజేయ అర్ధసెంచరీలతో హెడ్, అభిషేక్ వీరవిహారం

లక్నోపై హైదరాబాద్ ఘన విజయం • ప్లేఆఫ్స్‌లో ముందంజ

సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) వీరంగం సృష్టించింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటములతో ఒత్తిడిలో ఉన్న హైదరాబాద్.. సొంత ఇలాఖాలో తమ సత్తా ఏంటో చూపెట్టింది. లక్నో సూపర్‌జెయింట్స్‌కు చుక్కలు చూపిస్తూ ప్లేఆఫ్స్ రేసులో మరింత ముందంజ వేసింది. టాప్-4లో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కింది. తొలుత లక్నోకు స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన హైదరాబాద్.. ట్రావిస్ హెడ్,అభిషేక్‌శర్మ.. వీరవిహారంతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది.ఎస్ఆర్‌హెచ్ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసు నుంచి ముంబై తప్పుకుంది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులకు ఫుల్ బిర్యానీ విందు అందించింది. రసవత్తరంగా సాగుతున్న కీలకమైన ప్లేఆఫ్స్ రేసులో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమదైన రీతిలో లక్నో సూపర్‌జెయింట్స్‌ను చిత్తుచేస్తూ గెలుపు ఢంకా మోగించింది. బుధవారం పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో లక్నోపై భారీ విజయం సాధించింది. తొలుత లక్నో.. నిర్ణీత 20 ఓవర్లలో 165-4 స్కోరుకు పరిమితమైంది. ఆయూశ్ బదోని(30 బంతుల్లో 55 నాటౌట్, 9ఫోర్లు), నికోలస్ పూరన్ (26 బంతుల్లో 48 నాటౌట్, 6ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భువనేశ్వర్(2/12) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన రైజర్స్ 9.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 167 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(30 బంతుల్లో 89 నాటౌట్. 8ఫోర్లు, 8సిక్స్‌లు), అభిషేక్ శర్మ(28 బంతుల్లో 75 నాటౌట్, 8ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీలతో కదంతొక్కారు. లక్నో బౌలర్లు కనీసం ఒక వికెట్ తీయలేకపోయారు. సూపర్ అర్ధసెంచరీతో అదరగొట్టిన హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

హెడ్, అభిషేక్ వీరవిహారం:

ఆగ్నికి ఆజ్యం తోడైనట్లు ట్రావిస్ హెడ్‌కు అభిషేక్‌శర్మ తోడవ్వడం హైదరాబాద్ భారీ విజయానికి కారణమైంది. లక్నో నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనలో ఆది నుంచే రైజర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరు కలిసి బౌండరీలు అలవోకగా బాదుతూ ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారించారు. యశ్ ఠాకూర్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే వీరి విధ్వంసానికి తెరలేచింది. ఈ ఓవర్లో అభిషేక నాలుగు ఫోర్లతో 17 పరుగులు వచ్చి పడ్డాయి. ఇక తన వంతు అన్నట్లు హెడ్..గౌతమ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మూడు భారీ సిక్స్‌లు, ఫోర్‌తో గేర్ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. రవి బిష్ణోయ్ 4వ ఓవర్లో అభిషేక్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన నవీనుల్ హక్ ఈసారి రైజర్స్ ఓపెనర్ల బ్యాటింగ్‌కు బలయ్యాడు. ఈ క్రమంలో 16 బంతుల్లో మెరుపు అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరి దూకుడును అడ్డుకునేందుకు లక్నో కెప్టెన్ రాహుల్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. మరో మారు బౌలింగ్‌కు వచ్చిన యశ్ ఠాకూర్‌ను అభిషేక్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో అరుసుకోవడంతో 20 పరుగులు వచ్చి పడ్డాయి. ఇలా ప్రతీ ఓవర్‌కు 15 పరుగులకు తగ్గకుండా హైదరాబాద్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి రైజర్స్ 107 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో రెండో అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరు నమోదు చేసుకుంది. ఏడో ఓవర్‌కు వచ్చిన బదోనిని హెడ్, అభిషేక్ ఇద్దరు కలిసి దడేల్‌మనిపించారు. అభిషేక్ 19 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరి బౌండరీల జోరుతో లక్ష్యం అంతకంతకు కరిగిపోగా..యశ్ ఠాకూర్ 10వ ఓవర్ నాలుగో బంతిని అభిషేక్ సిక్స్ కొట్టి మ్యాచ్‌కు ఘనమైన ముగింపు ఇచ్చాడు. 62 బంతులు మిగిలి ఉండగానే హైదరాబాద్ రికార్డు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది.

లక్నో పడుతూ లేస్తూ:

టాస్ గెలిచిన లక్నో మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. తాము తప్పు చేసిన సంగతి తెలుసుకునేందుకు లక్నోకు పెద్ద సమయం పట్టలేదు. పిచ్ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఆది నుంచే సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు ఆది నుంచే లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. భువనేశ్వర్ మూడో ఓవర్ తొలి బంతికి భారీ షాట్ ఆడబోయిన క్వింటన్ డికాక్(2) నితీశ్‌రెడ్డి క్యాచ్ పట్టడంతో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. అతడే వేసిన ఐదో ఓవర్లో స్టోయినిస్(3) సన్వీర్‌సింగ్ సూపర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. నాలుగో వికెట్‌గా వచ్చిన కృనాల్ పాండ్యా..రాహుల్‌కు జత కలిశాడు. వీరిద్దరు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పది ఓవర్లు ముగిసే సరికి లక్నో 57 పరుగులకు 3 కీలక వికెట్లు కోల్పోయింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో కృనాల్ పాండ్యా(24) రనౌట్‌గా వెనుదిరుగడంతో లక్నో కష్టాలు మరింత రెట్టింపు అయ్యాయి. అయితే ఇక్కణ్నుంచి నికోలస్ పూరన్, ఆయూశ్ బదోనీ బ్యాటింగ్‌తో లక్నో గాడిలో పడింది. టాపార్డర్ తడబడ్డ చోట..బదోని, పూరన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది ఆఖర్లో ధాటిగా ఆడటంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 165/4 (బదోని 55 నాటౌట్, పూరన్ 48 నాటౌట్, భువనేశ్వర్ 2/12, కమిన్స్ 1/47), హైదరాబాద్: 9.4 ఓవర్లలో 167/0 (హెడ్ 89 నాటౌట్, అభిషేక్ 75 నాటౌట్)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	11	8	3	1.45	16
రాజస్థాన్	11	8	3	0.47	16
హైదరాబాద్	12	7	5	0.40	14
చెన్నై	11	6	5	0.70	12
ఢిల్లీ	12	6	6	-0.31	12
లక్నో	12	6	6	-0.76	12
బెంగళూరు	11	4	7	-0.04	8
పంజాబ్	11	4	7	-0.06	8
ముంబై	12	4	8	-0.21	8
గుజరాత్	11	4	7	-1.32	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

ఉప్పల్ పోరు

రికార్డుల హోరు

12 హైదరాబాద్ చేసిన 167 పరుగులలో ఓపెనర్లు తీసిన సింగిల్స్. మిగిలిన పరుగులన్నీ 4, 6 రూపంలో వచ్చినవే. హెడ్, అభిషేక్ కలిసి 16 ఫోర్లు, 14 సిక్సర్లు (ఇవే 148) బాదారు.

ఛేదనను హైదరాబాద్ రాత్రి 9:23 గంటలకు మొదలు పెట్టి 10:15 గంటలకు పూర్తిచేసింది. 42 నిమిషాల్లో ఛేదన పూర్తైంది.

ఐపీఎల్ చరిత్రలో మొదటి 10 ఓవర్ల ఆట తర్వాత అత్యధిక స్కోరు ఇదే (167/0). గతంలో ఈ రికార్డు హైదరాబాద్ పేరిటే (ఢిల్లీపై 158) ఉంది.

62 వంద పరుగులు, అంతకంటే ఎక్కువ టార్గెట్ ఉండి ఎక్కువ బంతులు మిగిలుండగానే విజయం సాధించడం ఐపీఎల్ చరిత్రలో ఇదే ప్రథమం. లక్నోతో మ్యాచ్‌లో హైదరాబాద్ 62 బంతులుండగానే లక్ష్యాన్ని పూర్తిచేసింది.

34 ఐపీఎల్‌లో అతి తక్కువ బంతుల్లోనే వంద పరుగులు జతచేసిన జోడీలో హెడ్-అభిషేక్ రెండో స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో మొదటి స్థానం (30 బంతులు) కూడా వాళ్లదే.

హైదరాబాద్ తరపున అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీలు చేసినవారిలో తొలి నాలుగు స్థానాలు హెడ్-అభిషేక్‌వే. హెడ్ ఈ సీజన్‌లో మూడు సార్లు ఆ ఘనత సాధించగా అభిషేక్ ఓసారి ఆ రికార్డు అందుకున్నాడు.

పేదలను మోసగిస్తున్న రేవంత్

మాదిగల మద్దతు బీఆర్ఎస్‌కే • టీఎస్ ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి

మహబూబాబాద్ రూరల్, మే 8 : సీఎం రేవంత్‌రెడ్డి పేదలను మోసం చేస్తున్నారని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మహబూబాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ మాదిగలకు వ్యతిరేకమని అన్నారు. కేసీఆర్ నేతృత్వంలోనే దళితులకు అన్ని విధాలా మేలు జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు అన్యాయం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల పట్ల కక్షపూరిత రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. మాదిగలు ఒక్క తాటి పైకి వచ్చి కాంగ్రెస్ అభ్యర్థి కావ్యను ఓడించాలని పిలుపునిచ్చారు.

జూన్‌లో వస్తా.. విచారణకు సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్‌లో కుట్రలకు పాల్పడలేదు
- ప్రతిభ ఆధారంగానే ఎస్ఐబీలో నాకు పోస్టు
- అమెరికాలో చికిత్స పొందుతున్న
- అఫిడవిట్ ద్వారా ఎస్ఐబీ మాజీ చీఫ్ స్పందన!
- వారెంట్ జారీ చేయొద్దని ప్రభాకర్‌రావు పిటిషన్

నాంపల్లి కోర్టులు, మే 8 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో ఎలాంటి కుట్రలకు పాల్పడలేదని, విచారణలో భాగంగా దర్యాప్తు అధికారులకు అన్నివిధాలా సహకరిస్తానని అమెరికాలో ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కోర్టుకు తెలిపారు. ఇటీవల పంజాగుట్ట పోలీసులు ప్రభాకర్‌రావుపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని న్యాయస్థానంలో పిటిషన్ వేయగా, దీనిపై వాదనలు జరిగాయి. గురువారం తీర్పు వెలువడే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్‌రావు తరపున న్యాయవాది కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. అమెరికాలో వైద్య చికిత్స పొందుతున్నారని, ఈ విషయం ఇప్పటికే దర్యాప్తు అధికారుల దృష్టిలో ఉన్నదని, ఫోన్ ద్వారా అందుబాటులో ఉంటానని చెప్పాడని, చికిత్స పూర్తయిన వెంటనే వస్తానన్నారని, వారెంట్ జారీ చేయవద్దని న్యాయవాది కోరారు. 73 సీఆర్‌పీసీ ప్రకారం ఆయనకు వారెంట్ జారీ చేయవద్దని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రభాకర్‌రావుకు కొవిడ్ సోకడంతో గొంతు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తీవ్రమయ్యాయయని కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకు తన సోదరుడి వద్దకు వెళ్లి వైద్య చికిత్స కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన వెళ్లారని తిరిగి రావడానికి జూన్ 26వ తేదీకి టికెట్లు బుక్ చేసుకున్నారని కోర్టుకు తెలిపారు. ఆయనకు సంబంధించి వివరాలను కుటుంబసభ్యులు అందించి, సహకరిస్తున్నారని, వారిని వేధించవద్దని కోరారు. ప్రభాకర్‌రావుకు ప్రతిభ ఆధారంగానే ఎస్ఐబీ చీఫ్‌గా బాధ్యతలు ఇచ్చారని, కుల ప్రతిపాదికన కాదని వివరించారు.

- బీజేపీ నాయకురాలు తమిళిసైపై ఫిర్యాదు

అయోధ్య రామమందిరం నమూనాతో బీజేపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్న ఆ పార్టీ నాయకురాలు తమిళిసైపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ లీగల్ టీమ్ ప్రతినిధులు లలితారెడ్డి, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, సదానందం, కార్తీక్

మేం చెప్పింది.. మాకే చెప్పారు

- విలువైన సమయాన్ని వృథా చేశారు
- ఎన్‌డీఎస్ఏ నివేదికపై ఇంజినీర్ల అసహనం
- సూచనల అమలుకు 20 రోజులే ఉంది
- బరాజ్ పనుల కొనసాగింపు అనుమానమే
- ఆ 2 గేట్ల తొలగింపే అతిపెద్ద సవాల్..
- ఇప్పటికే అధికారుల అధ్యయనం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణకు సంబంధించి ఎన్‌డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నిపుణుల కమిటీ నివేదికపై రాష్ట్ర ఇంజినీర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు సంబంధించి తాము ఎప్పుడో సూచించిన అంశాలనే మార్గదర్శకాల పేరిట జారీ చేశారు తప్ప అందులో కొత్త విషయాలేమీ లేవని ఆక్షేపిస్తున్నారు. విలువైన సమయాన్ని వృథా చేశారని, వర్షకాలం సమీపిస్తున్న తరుణంలో నివేదిక విడుదల చేసి పనులను పూర్తిచేయాలని ఆదేశించడంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆనాడే చెప్పిన రాష్ట్ర అధికారులు

మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ గత అక్టోబర్‌లో కుంగుబాటుకు గురైన రెండు రోజుల్లోనే ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్ఏ అధికారుల బృందం రాష్ట్రానికి విచ్చేసింది. అక్కడ ఎలాంటి పరీక్షలను నిర్వహించకుండానే బరాజ్ కుంగుబాటునకు అనేక ఊహాజనిత కారణాలను విశ్లేషిస్తూ వారం తిరక్కుండానే నివేదికను విడుదల చేసింది. మళ్లీ ఈ ఏడాది మార్చి వరకు బరాజ్ ఊసెత్తలేదు. ఆ తర్వాత ఎట్టకేలకు బరాజ్ కుంగుబాటునకు కారణాలను అధ్యయనం చేసి, పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసేందుకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో 5 సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ మార్చి నెలలో రెండు పర్యాయాలు క్షేత్రస్థాయిలో బరాజ్‌ను పరిశీలించింది. ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీల నుంచి వివరాలను సేకరించింది. ఆ వెంటనే ఆ మధ్యంతర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ఆ కమిటీకి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో బరాజ్ రక్షణకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై మధ్యంతర నివేదిక ఇవ్వాలని విన్నవించారు. దీంతో అన్ని బరాజ్‌లలో రాఫ్ట్ కింద ఉన్న రంధ్రాలను గుర్తించి, వాటిని పూడ్చడంతోపాటు బ్లాకులవారీగా గేట్ల నిర్వహణకు ఆధునిక స్కాడా విధానాన్ని అమలు చేయాలని కమిటీ సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఓఅండ్ఎం పనులను ఐఎస్ కోడ్ ప్రకారం చేపట్టేలా నిర్మాణ సంస్థలకు అవకాశం కల్పించాలని, బరాజ్‌ల ఎగువన, దిగువన వాటర్ ప్రూఫ్ కోసం సిమెంట్ గ్రౌటింగ్ చేపట్టడంతోపాటు ప్రవాహాలకు ఆటంకంగా మారే రాళ్లను తొలగించాలని తెలిపింది. వానాకాలంలో బరాజ్‌ల గేట్లన్నీ తెరిచే ఉంచాలని, మేడిగడ్డ 7వ బ్లాక్‌లో జామ్ అయిన గేట్లను తొలగించాలని, స్టీల్ షీట్‌పైల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని, బరాజ్‌లపై వరద ఒత్తిడిని తగ్గించేందుకు ఎగువభాగంలో నదిపై రెగ్యులేటర్లు నిర్మించాలని, బరాజ్‌ల ఎగువ, దిగువన నదీ గర్భంలోని ఇసుక మేటలను ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో తొలగించాల్సి ఉంటుందని తెలిపింది. ఆయా పనులను చేపట్టేందుకు అనుమతులివ్వాలని కోరింది. నాడు రాష్ట్ర అధికారులు సూచించిన అంశాలనే యథాతథంగా నేడు ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ సూచించడం గమనార్హం.

విలువైన సమయం వృథా

ఎన్‌డీఎస్ఏ సూచనలను అమలు చేయడానికి మిగిలింది 5 వారాలేనని, ప్రభుత్వం జనవరిలోనే ఆ పనులకు అనుమతిచ్చి ఉంటే ఈ పాటికి 90 శాతం పనులు పూర్తయ్యేవని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ, ప్రభుత్వానికి ఎన్‌డీఎస్ఏ మీదున్న భరోసా తమపై లేకుండా పోయిందని రాష్ట్ర ఇంజినీర్లు వాపోతున్నారు. ఇక ప్రస్తుతం కమిటీ సూచించిన విధంగా షీట్‌పైల్స్ డ్రైవ్ చేయడం తదితర పనులను పూర్తి చేసేందుకు సమయం సరిపోదని స్పష్టం చేస్తున్నారు.

2 గేట్ల తొలగింపే ప్రధాన సవాల్

ప్రస్తుతం మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్ గేట్లను ఎత్తడమే అతిపెద్ద సవాలని అధికారులు వివరిస్తున్నారు. బరాజ్‌లోని 7వ బ్లాక్ మినహా మిగిలిన అన్ని బ్లాకుల్లోని గేట్లను ఇప్పటికే అధికారులు పైకి ఎత్తిపెట్టారు. 7వ బ్లాక్‌లోని గేట్లను మాత్రం యథావిధిగా ఉంచారు. అందులోనూ ప్రధానంగా రెండు గేట్లు మినహా మిగతా గేట్లను ఎత్తడంలో పెద్దగా ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేస్తున్నారు. కేవలం కుంగుబాటుకు గురైన 20వ పిల్లర్, పగుళ్లు ఏర్పడిన 21వ పిల్లర్‌కు సంబంధించిన 2 గేట్లను తొలగించడం ఎలా అన్నదానిపైనే తర్జనభర్జనలు పడుతున్నట్టు అధికారులు చెప్తున్నారు. పిల్లర్ కుంగుబాటుతో గేట్ అమరిక సైతం చెదిరిపోయిందని, గేట్లను పైకి ఎత్తే రోప్‌లు వదులయ్యాయని, గ్రాంట్రీ క్రేన్ నడిచే ట్రాక్ సైతం వంగిపోయిందని అంటున్నారు. దాదాపు 70 టన్నుల బరువుండే ఒక్కో గేట్‌ను ఎత్తాలంటే 100 టన్నులకుపైగా బరువుండే మెషినరీ కావాలని, అలాంటి మెషినరీని ప్రస్తుత పరిస్థితుల్లో ఉపయోగించే అవకాశం లేదని చెప్తున్నారు.